అడల్ట్స్ ఓన్లీ కథ

# శాప విమోచనం

అలా విలాసంగా, కులాసాగా నడిచి వెడుతున్న వ్యక్తే చిదానందం. సార్థక నామధేయుడు. ఆయన చిత్తమెప్పుడూ ఆనంద సాగరంలోనే ఈదులాడుతుంటుంది. అందుకే ఎరుగున్న వారందరూ ఆయన్ని సదానందమనీ, నిత్యానందమనీ, బ్రహ్మానందఘనీ, పరమానందమనీ, ముద్దుగా పిలుస్తూంటారు. రిటైరైపోయినా ఆయన ఆలోచనలు మాత్రం నిత్య నూత్నయవ్వన సులోచనాలే! అందుకే యిరవైయేళ్ళకే అరవై ఏళ్ళ పైబడ్డట్టూ, పాతికేళ్ళకే పవరు తగ్గి, పరువం జారిపోయినట్టూ, నీరసంగా వేలాడే పడుచువాళ్ళంటే ఆయనకు పరమ చిరాకు.

అందుకని ఆర్నెల్ల క్రితం యింట్లో అద్దెకు దిగిన యంగ్ మారీడ్ కృష్ణమూర్తిని పిలిచి, ఎడాపెడా చెంపలు వాయించేద్దామనుకున్నాడు. కానీ అంతలోనే తమాయించుకొని, చతుర్విధోపాయాల్లో ఫస్టు పార్టునే టెస్టు డోసులా ప్రయోగించి చూద్దామనుకున్నారు. అందుకోసమే ఆ సాయంత్రం అతగాడ్ని డాబా మీద కెక్కించారు.

''ఏమిటోయ్! కృష్ణమూర్తీ! నిన్న రాత్రి అమ్మాయి-నువ్వు ఏదో వెర్బల్ ఫైటింగు చేసినట్లనిపించింది! ప్రణయ కలహాలా? సరస సల్లాపాలా?''

''అయ్యోరాత!..సరసమూ..సల్లాపము కూడానా?''

''మరైతే దేని గురించయ్యా! పెళ్ళై ఏడాదన్నా కాలేదు అప్పుడే చిరాకులూ చిటపటలూనా? ఇదిగో కృష్ణమూర్తీ! నీకు తెలుసో తెలీదో సరసమంటే మీ అత్తయ్యదేనయ్యా! ఎవరు? మా ముసిల్దీ-తాయారు-అదేనయ్యా- మా యింటావిడ! పెళ్ళైన కొత్తలో ఎన్నెన్ని సోయగాలు ఒలికించేది! ఎన్నెన్ని సరాగాలు పలికించేది! ఆఫీసుకెళ్ళేప్పుడో ముద్దు. ఆఫీసునుంచి రాగానే ఓ ముద్దు.. అబ్బో! ఆ రోజులన్నీ తలుచుకుంటుంటే..అయినా యిప్పుడు మాత్రం! అరవైయ్యో పడిలో పడుతోందన్నమాటేగాని, ఆ పరువం తగ్గిందా? ఆ పవరు తగ్గిందా? ఏమిటో...ఒక దాంట్లోంచి యింకో దాంట్లోకి వెళ్ళిపోతున్నాను కదూ! నాకదో పాడల వాటు. సరే..ఇంతకీ నీ సంగతి చెప్పావు కాదు. అమ్మాయి వాళ్ళ పిన్ని టైపు కాదా?''

''అదే కదండీ మావయ్యగారూ..నా బాధ!'' అంటూ బావురుమన్నాడు కృష్ణమూర్తి!

''నో..నో..ఏమిటా బేలతనం! చెయ్యెత్తితే అందని చెట్టంత మగాడివి! అందులోనూ అందరికీ 'లోను' ఇచ్చే బ్యాంకాఫీసరువి! యిలా బెంబేలు పడిపోతే యెలా? అసలు ప్రాబ్లమేమిటో నా చెవిని పడేయ్! ఏ ప్రాబ్లమొచ్చినా క్షణాల మీద సాల్వ్ చేసే యుగలదోయ్ మీ అత్తయ్య! ఊ! కమాన్! చల్లగా డాబా పైకొచ్చాక యింకా ముంత దాచడమెందుకు? అదేదో త్వరగా కక్కేయ్! ఇక్కడ ఉన్నది మనమిద్దరమే! నో ఫియర్! షురూ కరో'' అంటూ ముగ్గులోకి దింపాడు.

''అసలేం జరిగిందంటేనండీ'' అంటూ ప్రారంభించాడు కృష్ణమూర్తి!


★ ★ ★

''ఆ పాడు పన్లే వద్దని ఎన్నోసార్లు చెప్పాను. వదలండి ముందు..వదలమంటుంటే మీక్కాదూ!''

''ఏమిటే? కట్టుకున్న పెళ్ళాన్ని దగ్గరకు తీసుకోడం పాడు పనా? మరైతే పెళ్ళెందుకు చేసుకున్నావ్?''

''అంటే..మీ ఉద్దేశం...అందుకోసమేనా పెళ్ళి చేసుకొనేది?''

''ఏం? యిప్పుడు కలిసి కాపురం చేయడం లేదా?''



సోమంచి రామం

''ఆ! చేస్తున్నాం. జీవచ్ఛవాల్లా! ఓ ముద్దా? ఓ ముచ్చటా? అన్నీ మొదటి రాత్రే కొండెక్కేశాయి! ప్రేమగా.. తీయగా.. ఓ మాటా లేదు.. ఓ మంతీ లేదు''

''చాలు.. ఆ ఒక్క రాత్రి నరకం''

''ఏమిటే.. అది నీకు నరకమా? నాకిప్పుడర్థమవుతోందే.. అసలు నీకే పెళ్ళే యిష్టం లేదు''

''ఆ మాట మాత్రమనకండి! మీరంటే నాకిష్టమే! అందుకే మీకే లోటూ రాకుండా చూస్తున్నాను''

''ఏం చూస్తున్నావే? ఓ సరదా లేదు ఓ సరసం లేదు.. కేవలం మరబొమ్మలా ప్రవర్తిస్తున్నావు. నాక్కావల్సింది అలాంటి మైనం బొమ్మకాదు. చలాకితనం, చైతన్యంకల మనిషి. ఆ మనిషికో మనసుండాలి! ఆ మనసు నా మనసును తాకాలి! తీయని చూపుల్తో నన్నుక్కిరిబిక్కిరి చేసేసి లతలా చుట్టేసుకోవాలి!''

''అలాంటి వెకిలి చేష్టలు నాకిష్టం లేదు. భార్యగా నా ధర్మం నేను నెరవేరుస్తున్నానంతే! ఇక నేను పడుకుంటున్నాను. అర్ధరాత్రి లేచి మళ్ళీ ఏదన్నా చేయబోయారో...''



★ ★ ★

''ఇదండీ మావయ్యగారూ! నిన్న రాత్రి జరిగింది. ఇంకేం చెప్పమంటారు? నా బతుకే నరకం!''

ఆ యంగ్ కపుల్ ప్రాబ్లమంతా కరతలామలకమైపోయింది చిదానందంగారికి.

''ఊ! అయితే యిది ఫస్టునైటు ప్రాబ్లమన్న మాట! ఇదిగో కృష్ణమూర్తీ! స్త్రీలు స్వతహాగా సుకుమార్లు. సహజంగా ప్రతి స్త్రీ భర్త నుండి సున్నితమైన సరసాన్నే కోరుకుంటుంది. అంతేకాని గదిలోకి రాగానే గభాల్న వాటేసుకోవడం, ఊపిరి సలపనీకుండా, ఉడుంపట్టులా బిగి కౌగిలి పట్టేయడం లాంటి మోటు సరసాలు చేస్తే- ఇదిగో యిలాగే వ్యవహారం బెడిసికొడ్తుంది. అందుకే ఆమె మనసు నర్థం చేసుకొని, ప్రేమతో లాలించి అభిమానాన్ని పొందాలోయ్! అప్పుడే ఆ సంసారం స్వర్గతుల్యమౌతుంది! అయినా కృష్ణమూర్తీ! అరవైయేళ్ళు దాటిపోయినా యింకా మేం సంసార సుఖాలనుభవిస్తుంటే పెళ్ళైన ఏడాదికే మీ శృంగార జీవితం నరకప్రాయమైపోయిందని చెప్తుంటే..నా ప్రాణం గిలగిలా కొట్టుకుపోతోందోయ్! మై హార్ట్ మెల్ట్స్''

## ఇలియానా బిజినెస్

**నిన్నటి నవంబర్ 1వ తేదీన తన ఇరవై ఒకటో యేట అడుగుపెట్టిన ఇలియానా త్వరలోనే తన సొంత వ్యాపారాన్ని ప్రారంభించబోతోందిట. ఇలియానా వాళ్ల అమ్మ స్వతహాగా ఫ్యాషన్ డైజనర్ కాబట్టి రెడీమేడ్ దుస్తుల షోరూంని ముంబాయిలో ప్రారంభిస్తోంది. హైదరాబాదులో కూడా ఇలాంటి గార్మెంట్స్ షోరూంని ఆరంభించే ఆలోచనలో వున్న ఇలియానా- దేశవ్యాప్తంగా ఇలాంటి చెయిన్ స్టోర్‌ని మొదలుపెట్టాలని ఆలోచిస్తోందిట.**

''సిద్దూ! ఓసారిలా డౌనుకు దిగొస్తావా?'' అంటూ కింద నుంచి కేక వినపడింది.

''మీ అత్తయ్యేలే..మరేం కంగారుపడకు! దానికి ప్రేమావేశం పెల్లుబికినప్పుడల్లా అలాగే సరసంగా ముద్దుగా ప్రేమగా గోముగా..సిద్దూ అని పిల్చుకుని మురిసిపోతుంది. దానికదో ముద్దు. ఆ ముచ్చట మనమెందుకు కాదనాలి? ఏమంటావ్? సారీ ఫర్ ద ఇంటరప్షన్.. అంతరాయమునకు చింతిస్తున్నాము.. దిగు..దిగు'' ఇద్దరూ దిగిపోయారు.

★ ★ ★

''ఈరోజేమిటి యిలా రెచ్చిపోతున్నారు? నలభైయేళ్ళనుంచీ కాపురం చేస్తున్నా- యింకా కొత్త పెళ్ళికొడుకులా ఏమిటా ఆత్రం? వయాగ్రా టాబ్లెటేమన్నా వాడుతున్నారా యేమిటి?''

''ఒరిజినల్ పొటెన్సీ లేని సన్నాసులకే టాబ్లెట్లు, ఊరపిచ్చుక లేహ్యాలు! నాకెందుకే? మానసిక నిగ్రహమున్న నాబోటి వాడికి వాటితో పనేమిటి? మనిషికి మనసు ముఖ్యమే వయసు కాదు. మనోబలమున్న వాడికి శారీరక శక్తి అదే వస్తుంది. అండర్‌స్టాండ్!''

''అయ్యో..మీ శక్తి గురించి వేరే చెప్పాలా! ఇంత వయసొచ్చినా చెయ్యిచ్చుకుని గదిలోకి లాక్కుని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నప్పుడే తెలుస్తోంది మీ కండబలం, మీ గుండెబలం, మీ మొండిబలం''

''అవును. వయసు పెరిగినకొద్దీ చెట్టుకు చేవ..మనిషికి యావ పెరగాలి! దటీజ్ నేచర్!''

''అబ్బబ్బ..వదలండీ! సైడు పోర్షన్‌లో మొగుడూ పెళ్ళాలున్నారు''

''వాట్ మంగీ..వాళ్ళింకా యంగ్ కపుల్! జస్ట్ మారీడ్..సిక్స్‌మంత్స్ ఓల్డ్! ప్రొబేషన్ పీరియడన్నా పూర్తికాలేదు. వాళ్ళకేం తెలుస్తాయి శృంగార రహస్యాలు! వాళ్ళదంతా దూకుడు వ్యవహారం! ఇన్స్టంట్ కాఫీలా..జస్ట్ ఫర్ ఏ షార్ట్ పీరియడ్..''

''చాల్లెండి..మీ శృంగారాలు..సింగారాలు..''

''నో..నో..సింగారం నీది..శృంగారం నాది.. మంగీ! నువ్వీ నైటీలో మరీ కొట్టొచ్చినట్టు మరింత అందంగా కనబడుతున్నావోయ్! సిగ్గుతో మొగ్గల్లే ముడుచుకుపోయే ముగ్ధ, ముసల్దైపోయినా ముగ్ధమనోహరంగానే ఉంటుందిస్మీ! అయినా నువ్వెప్పటికీ ముసిల్దానివికావు. నువ్వు నా కళ్ళకెప్పుడూ నిత్య నూత్న జవ్వనివే! ఈ నీ అధరాలు...అరవిందాలు! ఇదిగో..శంఖం లాంటి మృదువైన నీ కంఠం...''

''ఆ..ఆ..ఆ..ఆ చెయ్యి క్రిందకు రానీయకండి''

★ ★ ★

''ఉన్న పళాన మాటలాగిపోయాయేమిటి? అరె..కరెంటు కూడా పోయిందే! అయితే ఓనరుగారు గ్రంధసాంగుడేనన్నమాట! అమ్మో ఏమోననుకున్నా! మాంచి రసికుడే! ఆవిడగారు ఊరెళ్ళగా చూసి రాత్రికి ఎవర్నో ఏకంగా యింటికే తెచ్చేసుకున్నాడు. హమ్మ..హమ్మ..అర్వై ఆరేళ్ళ ఆ ముసిలాడికే యింకా ఆ యావ పోలేదంటే..ఇక నా సంగతేం చెప్పుకోవాలి? కట్టుకున్న పెళ్ళాం కస్సుబుస్సుంటా కసిరికొట్టుంటే నేను మాత్రం ఆ సుఖం..'' కృష్ణమూర్తి మానసిక ఘోష!

★ ★ ★

''ఊర్నించి వచ్చేశారా పిన్నిగారూ?''

''ఎవరూ?..కళ్యాణా! రామ్మా..రా! ఏం యిలా వచ్చావు? ఏమన్నా కావాలా?''

''ఏం లేదు పిన్నిగారూ! బాబాయ్‌గారు బజారెళ్ళినట్టున్నారు! మీతో ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు''

''ఏమిటమ్మా అది!''

''అదే..అది..అది..బాబాయిగారు..చెప్పాలంటే నాకే సిగ్గుగా ఉంది! ఎవరో మంగిట...ఆవిడతో రాత్రి..'' అంటూ మిగిలిందంతా, తాయారమ్మగారి చెవిలో చెప్పేసింది, కృష్ణమూర్తి భార్య.

''అలాగా! ఆయన సంగతి నేను చూసుకుంటా లేమ్మా!'' అంది తాయారమ్మగారు తాపీగా!

''అదేమిటి పిన్నిగారూ! అలాంటి విషయాన్ని అంత తేల్గ్గా తీసిపారేస్తారు! ఆయన...''

''అమ్మా కళ్యాణీ! నా బంగారం మీద నాకు నమ్మకముంది. ఒక్కటి మాత్రం గుర్తుంచుకోమ్మా! కట్టుకొన్న మొగుడ్ని సుఖపెట్టని భార్యుంటేనే, ఆ మగాడు కట్టుతప్పడం ఖాయం!''

''అయితే..బాబాయిగారు..''

''చెప్తానమ్మా! చెప్తా! వండి వార్చిపెడుతున్నాను కదా, మొగుడికింతకంటే ఏం చేయాలీ అని ఆడదనుకుంటే సరిపోదమ్మా! సరసాలతో సరాగాలతో మగాడు సంతోషంగా ఉండేలా చూసే బాధ్యత ఆడదానిదైతే, ఆ ఆడది కంట తడిపెట్టకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మగాడిదౌతుంది! అలా కాకుండా శుక్రవారాలని, శనివారాలని, పూజలని... యిలా మొగుడ్ని అంటరాని వాడుగా చూస్తూ దగ్గరకు రానీయని భార్యలుంటే, భర్తలిలా మంగీల వెంట, రంగీల వెంట పడకమానరు''

''అయితే...బాబాయిగారు..రాత్రి.. మంగీతో..''

''అదో పెద్ద కథలేమ్మా..ఏదో కాలేజీ రోజుల్లో ఆ మంగీతో నాటకం వేశారు. అదిగో దాని తాలూకు డైలాగులు రికార్డు చేసుకొన్నారు. నేను ఊళ్ళో లేనప్పుడల్లా ఆ కేసెట్టు పెట్టుకొని ఆనందిస్తూంటారు. అదమ్మా సంగతి! ఇదిగో..యింకా కాసెట్టు యిక్కడే వుంది. కావాలంటే విను'' అంటూ తాయారమ్మగారు కేసెట్టు పెట్టింది.

కళ్యాణికి కళ్ళు తిరిగి పడిపోయినంత పనైంది.

''అయితే..మేం విన్నదంతా..'' అంటూ బేలగా అడిగింది.

''మేం అంటున్నావ్! అయితే అల్లుడు కూడా విన్నాడా? అయినా కళ్యాణీ! అరవై యేళ్ళు పైబడినా ఆయనకింకా ఆ చిలిపితనం, వలపుధనం పోలేదమ్మా! ఇక పోదు కూడా! అందుకే మాకింత ఆనందం''

''వస్తానండి..పిన్నిగారూ..ఆయన ఆఫీసు నుంచి వచ్చే వేళయింది..'' అంటూ వాళ్ళ వాటాలోకి వెళ్ళి పక్కమీద వాలిపోయింది. పిన్నిగారు చెప్పిన సంగతులన్నీ సినీమా రీల్సులా కళ్ళ ముందుకొస్తున్నాయి.!

★ ★ ★

ఎప్పుడూ లేనిది ఆరోజు కృష్ణమూర్తికి కళ్ళు తిరిగి పడిపోయేంత పనైంది ఆఫీసు నుంచి యింటికి వచ్చేసరికి! ఆకుపచ్చ షిఫాను సిల్కు చీరకట్టి, తలలో మూడు మూరల విరజాజి పూలదండతో వనదేవతలా చిరునవ్వు చిందిస్తూ, ఆహ్వానిస్తూ నిలబడ్డ కళ్యాణే అందుక్కారణం! అయినా యిది కలా, నిజమా అన్న సందేహంతో చేతిమీద గిల్లుకొని..''అమ్మా!'' అని అరిచాడు.

''ఎదురుగుండా నేనుంటే యిలాంటప్పుడు మీ అమ్మెందుకండీ?. ఏమైంది? దోమలేమన్నా కుట్టాయా?'' అంటూ అతని చేతిని లాలనగా మృదువుగా తన చేతిలోకి తీసుకుంది కళ్యాణి!

''హుర్రే!'' అంటూ పొంగిపోతూ దగ్గరకు లాక్కోబోయాడు కృష్ణమూర్తి!

''అబ్బ! వీధి వాకిట్లో ఏమిటే చేష్టలు...ముందు లోపలికి రండి'' అంటూ గబుక్కున లోపలికి లాగి తలుపేసేసింది!

ఎక్కడ్నించో ముసి ముసి నవ్వులు లీలగా వినపడ్డాయి!

★ ★ ★

''ఏ ఋజువులూ అక్కర్లేదయ్యా యింక! మీ అన్యోన్య దాంపత్యానికి మీ తిరుపతి యాత్రే సాక్ష్యం! లేవండి..లేవండి! ఆ దేవుడికి మొక్కుకొచ్చారు. అది చాలు! ఆయన ఆశీస్సులున్నాయి! ఇంకా మా ఆశీస్సులెందుకు?''

''అలాక్కాదు మావయ్యగారూ! నా సంసారం నరకమైపోతోందని భ్రమపడి భయపడి పోయిన నాకు సుఖ సంసార సోపానాలు చూపించారు. అందుకు మీ ఋణం...''

''అవును బాబాయిగారూ! అదేదో పాప కార్యమనే అపోహలోను, భ్రమలోను పడి ఇన్నాళ్ళూ ఆయన్ను దగ్గరకు రానీయకుండా దూరం చేసుకొన్నాను. భార్యాభర్తలెప్పుడూ సరదాగా, సరసంగా, సన్నిహితంగా ఉంటేనే ఆ సంసారం సాఫీగా సాగిపోతుందని చెప్పి పిన్నిగారు నా కళ్ళు తెరిపించారు. ఆవిడ ఋణం..''

''అలాగా..నాకు తెలీదే! ఏమిటోయ్ మంగీ.. వీళ్ళిద్దరూ ఏమిటో ఋణపడి పోయామంటున్నారు?''

''అదేమిటి పిన్నిగారూ! మిమ్మల్ని మంగీ అని పిలుస్తున్నారేమిటి బాబాయిగారు?'' తెల్లబోతూ అడిగింది.

''ఊ..అదంతా ఓ కథలేమ్మా..ఏం చెప్పమంటావు? మీ బాబాయిగార్కి ప్రేమావేశం పెల్లుబికినప్పుడల్లా అలాగే సరసంగా, ముద్దుగా, ప్రేమగా, గోముగా మంగీ అని పిల్చుకొని మురిసిపోతారమ్మా! ఆయనకదో ముద్దు..ఆయన..''

''ముచ్చట మనమెందుకు కాదనాలి? కదు మావయ్యగారూ'' అంటూ ఠపీమని అందుకున్నాడు కృష్ణమూర్తి, ఏదో గుర్తొచ్చినట్లుగా!

''నీకూ తెలిసిపోయిందే అల్లుడూ!'' అంది తాయారమ్మగారు.

''మరైతే..ఆ కేసెటు..ఆ నాటకం..ఆ మంగీ'' అంటూ అయోమయంలో తికమకపడిపోతూ అడిగింది కళ్యాణి, ఏం అర్థంకాక!

''అవునమ్మాయ్! అది నిజంగా నాటకమే..రచన, దర్శకత్వం, పాత్రధారులు-చిదానందం-ఉరఫ్..సిద్దూ, మంగతాయారు-ఉరఫ్-మంగీ..శ్రోతలు..కళ్యాణీ, కృష్ణమూర్తి'' అంటూ ముక్తాయించారు చిదానందంగారు.

''అమ్మాయ్ కళ్యాణీ! ఆ..అప్పుడే పదయింది..'' అంటూ ఆవులిస్తూ ''ఇకమేం ఉండలేమమ్మా..బై..బై'' అంటూ పార్వతీ పరమేశ్వరుల్లా ఆ వృద్ధదంపతులు వాళ్ళ కోవెలలోకి వెళ్ళిపోయారు.

ఒకళ్ళ కళ్ళల్లోకి ఒకళ్ళు మత్తుగా గమ్మత్తుగా చూసుకుంటూ శాపవిమోచనం పొందిన గంధర్వ ప్రేమికుల్లా కళ్యాణీ, కృష్ణమూర్తులు రతీమన్మథులై, రెట్టించిన ఉత్సాహంగా మదన సామ్రాజ్యం ప్రవేశం చేస్తున్నారు.

లైట్సాఫ్!

ఇక మనం సెలవు తీసుకుంటే-అందరికీ మంచి మర్యాద!

☆

